# వికట్టాటహాసము

నా గుండె తలుపులు
మూసి యుండుట జూచి
ముసుగు మెల్లగ దీసి
మనసు నిల్కడ జేసి
తన చేతి కొనవ్రేళ్ళ
తట్టినది మెల్లగా
తలుపు తెక్కలనంటి
కదిలింది యొక తెక్క
వదిలి మెల్లగ దోవ
మచ్చికగ యా బాల
వచ్చినది లోపలికి
మౌనముద్రను దాల్చి
మాటాడనే లేదు
పలుకరించాలని
పెదవి కదిపినేను
అమ్మాయి కనుదోయి
చమ్మ గిల్లిన దపుడె
కన్నీరు నించుటకు
కతన మేమని యడగ
పెకలించి కళ్ళలో
సుళ్ళు తిరిగెను నీళ్ళు
"పతనమైనది స్వామి !
మన ప్రేమ పథకః"
అని జార విడిచెను
ఆ రెండు మాటలు
నా యెదను మిగిలినది
దట్టమౌ ఆఫ్రికా
అడవి చీకటి కొంత
వికటాట్టహాసమే

— మణికంటి నారాయణ

చారిత్రాత్మక కథ :

# పునర్మూషికో భవ!

రచన: కాలిపు వీరభద్రుడు

నిబిడాంధకారం... నిర్మానుష్యం !...

వారణాసిలో వెలసిన విశ్వేశ్వరుని మందిరం యొక్క మండపాపాంతాన వెలువడుతున్న ఘంటాస్వనం మాత్రమే వుండుండి నలుమూలలా ప్రతిధ్వనిస్తూంది.

అమవస నిశి. సగం గడిచిన రాత్రి. కన్నుకానని కటిక చీకటి. వారణాసి పొలిమేరలో— బుద్ధ విహారానికి సమీపాన వున్న కానసంలో కామిని !...

అందునా ఒంటరిగా ! ..

ఉండూండి ఆలయ ప్రాంగణ మందున్న ఘంటానాదం వినవస్తూంది. గంట మ్రోగినప్పుడల్లా కంగారుతో ఉలిక్కిపడుతూనే వుంది కామిని ! అపార పారావార మహోత్తుంగ తరంగాలవలె ఆమె ఆలోచనలు పడుతూ లేస్తున్నాయి

రాత్రి... అంధకారము— యీ రెండూ భయానకాలే. కాని... ప్రేమమయి రమణి యొక్క హృదయం కంటేనా ? .. భువి మీద దివి వుందీ అంటే నారీ హృదయం లోనే. హృదయ కమలాన్ని విప్పి, అసమ సుమర్చి అమర ప్రణయాన్ని చవి చూపిస్తూంది నారీమణి. అరుణాధరాల్లోంచి మధువు నందించి, పురుషప్రాణి పీకని పిసికొట్టి మనోరంజనాన్ని మత్తుని కలిగించేది నారీమణి. అయినా...

కఠిన చిత్తుడా !. నీ పేరెత్తితే నా రక్తం ప్రతీకారంతో పరవళ్ళు త్రొక్కుతూంది... నన్ను తృణీకరించేవు. వలచి వస్తే వద్దని కాలదన్నేవు హుఁ ! నారీ హృదయంనుండి వైరాగవు నరకమింకెక్కడా లేదు. నారీ హృదయంలోనే వుంది. మదవతి మదిలో రోషానలం రగిలిందంటే అమృతాధరాల్ని విష కోశాలుగా మార్చి, బుసలు చల్లుతూ పడగార్చిన విషోరగం వలె కస్సున లేచి కాటేస్తూంది. పురుషజాతిని విషయ వాసనలలో ముంచి అంధకార బంధురమగు కూపాని కీడ్పగావిస్తూందీ నాగినిసమ నారీమణే.

మాగంధీ !... ఛీ ఛీ అదే పేరా ! నువ్వు గతించి ఎన్నాళ్లో అయింది. నీ చరిత్ర ముగిసింది. ఆ మార్గానికి కంటకం కావడమే నీ ధ్యేయం. జయాపజయాలు దైవాధీనాలు. ఆ కర్కశ హృదయుడు నిరాకరించినా అంతకి పదిరెట్లు పదవిని పొందేవు. రాణి అయి రాణించేవు. నీ జన్మసార్థకమైంది. ఇప్పుడు నువ్వు— కాదు— నేను శ్యామని. వారణాసిలోని విఖ్యాత వారాంగనను విలాసినిని... పురుషులో కాన్ని నాశనం చేసిందాకా యీ శ్యామకిక శాంతలేదు, పురుషుల్ని దాసులుగా చేస్తాను.

నన్ను తృణీకరించేవు గదూ ! ..

నీకంటే నవమన్మథులు వేలకొలది నా చుట్టూ ఈగల్లాగ ముసురుకుంటున్నారు నా కృపా కటాక్షానికి కాసుకొస్తూన్నారు. తృప్తితీర భోగాలు అనుభవిస్తాను. నా దాహం తీర్చుకుంటాను, క... సి... కూడా తీసుకుంది. ఆ తర్వాత వీళ్ళని పనికిరాని గుడ్డ పీలికల్లాగ పెంటకుప్పమీద పారేస్తాను.

మాగంధి బ్రాహ్మణకుల సంజాత. విధి వక్రించినందున గోపాలకురాలయింది కాని

(తరువాయి 19 వ పేజి)

## ★ పునర్మూషికో భవ ★

(10 వ పేజీ తరువాయి)

కాలమొక్కరీతిగ గడవదు. మాగంధికి యుక్త వచ్చింది. చూపరులను ముగ్ధుల్ని చేసే ప్రాయముతో సౌందర్యవతిగా వాడవాడలా మార్మోగింది. మాగంధి సర్వాంగ శోభిత సుందరి తొలియవ్వనపు జవ్వని. శతాధికముగ యువకులామెని వివాహమాడ్డానికి వచ్చేరు. కాని మాగంధి తండ్రి మాగంధిని గౌతమునకు యివ్వాలనుకున్నాడు.

సర్వసంగ పరిత్యాగికి సర్వాంగ సుందర సౌందర్యవతి! చిరు దరహాసాన్నే అనంగీకార సూచనగా ధ్యాన ముద్రలో మునిగిపోయేరు బుద్ధభగవానులు. మాగంధి గతుక్కుమంది. కుంగిపోయింది... తనని గైకొనని గౌతముని భావాన్ని సూటిగా, సరళంగా స్వీకరించలేక పోయింది. మాగంధి అహం దెబ్బతిన్నది.

అందానికి కానుకా యిది! సౌందర్యవతికిదేనా పురస్కృతి!!

ఇనుమడించిన రూపగర్వంతో, వయోరుచితో యువకుల హృదయాలను ఉర్రూతలూగించే మాగంధి గౌతముడిపై కత్తి కట్టింది. పగబూనింది. ప్రతీకారం వెదికింది. గౌతముని శాంత్యహింసల ప్రచారక ప్రవాహానికి అడ్డుగా నిలిచింది... కుట్రలు మోసాలు సాధనాలయ్యేయి. ఆ మహనీయుని మార్గానికి ఒక అడ్డంకి! పర్వతంతో పొట్టేలు!! అయినా మాగంధి కోపానలానికి ఆమె అదృష్టా నిలుదు అండగా నిలిచేడు... భాగ్యరేఖ మెరిసింది.

◆ ◆ ◆

మాగంధి కౌశాంబి రాజు ఉదయనుడి హృదయ సామ్రాజ్ఞి. పద్మావతీ వాసవదత్తలకి సపత్ని. రాజ మహిషిగా మన్ననలు!

'ఎక్కడి గ్రామీణ బాలిక! ఎక్కడి రాజ రాణి!!

'గౌతముడు రాజ ప్రాసాదాలలో ప్రచారాలు ప్రారంభించేడు. అనుచితం కాదా అది? అంటునా మీకు తెలియకుండా హర్మ్య పరిభాగాలలోవున్న రాణి వాసపు కాంతలతోనా ఆ కాషాయాంబరధారి రహస్య సమావేశాలు! 'గౌతముడు రూపసి' అని లోకమంతా కోడికూసినట్టు కూస్తున్నది... ఏమో రాణులు మోజులు పడితే!' విలాస మందిరంలో ఉదయనుడి హృదయంమీద వదనాన్ని ఆనించి విలాసంగా వయ్యారంగా కనుల కొసల చూస్తూ చిలకలా పలికింది మాగంధి ఉదయనుడితో.

పద్మావతీ బుద్ధులమీద పట్టరాని క్రోధంతో ఉదయనుడు మాగంధియొక్క సౌధోపరితలం నుండి వడివడిగా దిగివచ్చేసేడు.

రాణిక అక్కడుండక మేడకి చిచ్చుపెట్టి అందులోబడి మాగంధి మరణించినన్న ప్రవాదాన్ని పుట్టించి, రహస్యంగా బయటికి వచ్చేసింది మాగంధి.

మాగంధికి కామ తృష్ణ తగ్గలేదు. రూపగర్వము, కామోద్రిక్తత ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి మాగంధిలో. ఆఖరికి ప్రముఖ వారవనిత శ్యామగా వారణాసిలో సరికొత్త రూపంలో అవతరించింది. రసిక శ్రేష్ఠులగు వణిక్ప్రభువుల పుత్రరత్నాలు, శృంగార సార్వభౌములగు కోసలరాజు బంధువులు, విలాస ప్రభులగు వారణాసి పురప్రముఖులు శ్యామసౌందర్యాంబుధి మునింగు లిడనిదే తమ తమ జన్మలకు సార్థకత లేదని క్రొత్తనీటికి చేప ఎగ బ్రాకినట్లు శ్యామచుట్టూ చేరేరు. రసిక యువకజనము శ్యామ పొందుకై పోటీలు పడుతున్నారు. మారుని వాడియైన బాణాలకి గురియైన పురుషసంఘము శ్యామ సన్నిధిలో సేద తీర్చుకుంటున్నది.

పురుష ప్రపంచాన్ని పీడిస్తానని పంతం పట్టిన శ్యామ తనకి తెలియకుండానే శైలేంద్రుడికి దాసురాలయింది. ప్రేమంటే ఏమిటో

(తరువాయి 21 వ పేజీ)

## టైంపాస్ బటాణీలు

ఎందుకు యీ పోరాటం
ఏమిటి యీ సంఘర్షణ
నాలుగు ఘడియల బ్రతుకుకు
ఎందుకు యీ ఆకర్షణ
ఏ గమ్యానికి యీ
విరామ మెరుగని పయనం
ఏయే సీమలకీ
అవిశ్రాంత ప్రయాణం
మమతల మెను వూయలలో
వూగును ఏలనో మనుజుడు
తరతమాల అహమిహికలు
ఎందుకోయి మనుషుల్లో
'రాగం ద్వేషం' ఆటు పోటు
ఎందుకు జీవన సంద్రంలో
కుసుమించిన నవ జవ్వని
హృదిలో ఏలనో కాంక్షలు
మానవ జీవన హోమంలో
ఎందుకు విషాగ్ని కీలలు
మనిషీ మనిషికి అందని
అంతస్థుల భవంతులేల
వ్యాపకం లేని బ్రతుకును
గడుపుట క్షణ మొక యుగం
పురోగమనం తిరోగమనం
జనన మరణాల చక్రభ్రమణం
అందరి గమ్యం ఒకటే
పుట్టుట గిట్టుట కొరకే
జననం నుండి మరణానికి
నరక నాకాల కనిపించని మరో
లోకంలోకి...
జరం చేసే 'పాసింజర్' ప్రయాణంలో
యివన్నీ ...
టైం పాస్ బటాణీలు!!!...

—సి తా రా

కవిత:

## ఎలా వుంటావో....?

నిన్ను చూడని నేను
ఎదేదో ఊహించుకుంటు
పరుపులో పడుకున్న వాణ్ణి
ఒక్కణ్ణిపడుకోలేక లేచి
పండు వెన్నెలని చూసి
నవ్వుతున్న తోటలోకి పోయాను
నిన్ను గురించిన ఊహ
నన్ను తికమక పెడుతువుంది
నీ రూపం చూడాలని
నా మనసు పరుగెడుతువుంది
ఎలాగైతేనేం! చివరకు
నిన్ను గురించిన ఊహ
రేఖాచిత్రాన్ని నా మనో
ఫలకంపై చిత్రించుకున్నాను
మనోఫలకంపై చిత్రించుకున్న
నీ రూపమే నాలో నరనరాలకు
వ్యాపించి
నా శరీరాన్ని సైతం పరవశింప
చేస్తున్నది
నే చిత్రించుకున్న నీ రూపమే
ఇంత మనోహారంగా
సుధారసంగా వుంటే
మరి నీ వెలా వుంటావో...

—అమరశ్రీ

## ★ పునర్మూషికో భవ ★

(19 వ పేజి తరువాయి)

శైలేంద్రుడి సాహచర్యంలోనే తెలుసుకుంది శ్యామ. శైలేంద్రుడు లేనిదే శ్యామ లేదనే అనుకుంది.

శ్యామ శైలేంద్రుడి చేతి కీలుబొమ్మ!

తృప్తిదీర శైలేంద్రుడితో అమరసుఖాన్ని అనుభవించడమే శ్యామ జీవితానికిప్పుడు పరమావధి. శైలేంద్రుడి లేనిక్షణం- శ్యామకొక యుగం.

శైలేంద్రుడి కోసమే యీనాటి యీ అర్ధరాత్రి శ్యామ నిరీక్షిస్తూంది.

శైలేంద్రుడొక బందిపోటు. కోసలప్రభువు ప్రసేనుని ఏకైకపుత్రుడు. రాజ్యకాంక్ష, పదవీ వ్యామోహాలచే ప్రేరితుడైన యువకుడగు విరుద్ధకుడు తన యువక హృదయ విద్రోహానికి లొంగిపోగా కన్నతండ్రిపైననే విద్రోహానికి సమకట్టిన సామర్థ్యానికి ఫలితంగా రాజ్య బహిష్కృతుడయ్యాడు. ఆ బహిష్కరణ ఫలితమే విరుద్ధకుడ్ని బందిపోటు శైలేంద్రుడిగా మార్చింది.

సైన్యాన్ని సమకూర్చుకోడానికి అర్థబలముండాలి. డబ్బు సంపాదించడానికి శ్యామని సాధనంగా తీసుకున్నాడు శైలేంద్రుడు. శ్యామని అండగా చేసుకొని దోపిడీలు హత్యలు చెయ్యడానికి కూడా శైలేంద్రుడు వెనుదీయలేదు.

సుదూరంనుంచి అశ్వం యొక్క పదసవ్వడి శ్యామకి వినిపించింది. ఒక్క అడుగు ముందుకి వేసింది.

ఆలయ ఘంటారావం వనమంతా వ్యాపించింది.

శ్యామ తుళ్ళిపడింది, ముందుకి వేసిన పాదం వెనక్కి వచ్చేసింది. నిర్నిమేష దృక్కులతో అలాగే నిల్చుండి పోయింది. అశ్వంతనికి దగ్గరగా వచ్చేసింది. అశ్వారోహకుడు శైలేంద్రుడని శ్యామకి తెలుసు. అతనికోసమేగదా నిరీక్షిస్తున్నది. శైలేంద్ర రోజూ ఆవేళకి తనదగ్గరికి వస్తూవుంటాడు గదా! 'శైలేంద్రా!' పిలిచింది.

'శ్యామా! యీ కీకారణ్యంలోనా నువ్వు?! అశ్వాన్నాపి రికాబుల్లోంచి కాలుతీసి కిందికి దిగేడు శైలేంద్రుడు. శైలేంద్రుడ్ని అంటుకుపోయింది శ్యామ

'అవును శైలేంద్రా! నా యీ హృదయ వేసాన్ని పోగొట్ట సమర్థుడవు నువ్వొక్కడవే... ఏమిటలా చూస్తున్నావు?! నేనేమిటిలా అంటున్నాననా? లేక నా ప్రేమని పరీక్షిస్తావా?'

శైలేంద్రుడు చిన్నసవ్వు నవ్వేడు. చెంతనున్న పాదప పాదంమీద కూర్చున్నాడు.— 'నేను బందిపోటుదొంగను. నిన్ను హత్యచేస్తే.'

'నీ బందిపోటుతనాన్ని నమ్మే నన్ను నేను నీముందు సమర్పణ చేసుకున్నాను. నువ్వొక సామాన్యపురుషుడివే అయితే నేనిక్కడిలాగ వచ్చేదాన్ని కాదు. దొంగలు విశ్వాసఘాతకం చెయ్యరు. వాళ్ళకీ నీతి వుంటుంది.'

'...ఒంటరిగా నిన్ను కలియడానికొక్కడా నాకు భయమే. నువ్వు నారీమణివి. వారాంగనవు. బందిపోటు దొంగకంటే ప్రమాదకరం నువ్వు.' తరతలాన్ని నపుం వాల్చేడు శైలేంద్రుడు.

'ప్రేమ వ్యాపారం చేసే వారవేశ్యల్లో ప్రేమ ప్రవాహం ఇంకిపోతుందా? ప్రేమకి వేమ అనర్హులమా!? .. నన్ను నమ్ము శైలేంద్రా. మనస్సుతో నిన్ను ప్రేమిస్తున్నాను పూర్ణచంద్రుని అమృతమయ చంద్రికతో సమానమగు నా యీ శీతలప్రేమ ధూరి, క్రూరకర్మలు చేస్తూ పెంపటుదేరిన నీ కఠిన హృద

యాన్ని నింపలేక పోయిందా? ఇదిగో, మొనదేరిన యీ కఱకు కత్తితో నా గుండెల్ని చీల్చి నా ప్రేమను పరీక్షించు శైలేంద్రా!' మొలనున్న చురకత్తి తీసి శైలేంద్రుని ముందు నిల్చుంది శ్యామ.

'లేదు శ్యామా. లేదు' శ్యామని తన బాహువుల్లోకి తీసుకున్నాడు. శ్యామ శైలేంద్రుని మీద వాలిపోయింది. ఆశించిన తరుణ మాసన్నమైనందుకు శైలేంద్రుడు సంతసించేడు. శ్యామ గొంతు గట్టిగా నులిమేడు. ఘూర్ణిల్లిన శ్యామ నేలమీదికి ఒరిగింది. ఆమె శరీరం మీదున్న ఆభరణాలు తీసుకున్నాడు. ఆశ్వము నధిరోహించి అంతర్ధానమయ్యేడు.

ప్రభాతమయింది. బుద్ధభగవానులు శిష్యుడగు ఆనందుడితో అటుగా విచ్చేసేరు. చచ్చిపోయినట్టు పడివున్న స్త్రీని (శ్యామని) చూసేరు.

'తక్షణ మీమెను విహారానికి తీసుకువెళ్ళాలి, ఆనంద్!'

'ప్రభూ! యీ స్త్రీ శవాన్ని విహారానికి తీసుకువెళ్ళి మిమ్మల్ని మీరు కళంకపర్చుకుంటారా. అదీగాక, మీ ప్రతిద్వంద్వులు దీన్ని ఆధారం చేసుకొని నిందారోపణ మీపైని చెయ్యరా?!'

గౌతముని మోమున చిరునవ్వు మెరిసింది- 'కళంక మొస్తుందన్న సందేహంతో కరుణ సందేశాన్ని విస్మరిస్తావా, ఆనంద్! ఈమె మరణించలేదు. విలంబన వలదు.'

◆ ◆ ◆

విశాలమైన వారణాసి పురవీధుల్లో మామిడి పండ్లని విక్రయిస్తూ జీవితాన్ని వెళ్ళబుచ్చుతూంది శ్యామ. గ్రామ్యబాలికగా పశువుల్ని మేపిందానాడు. ఆమ్రపాలిగా మామిడిపళ్లని అమ్ముకొంటూన్నదీనాడు.

స్త్రీ సహజ స్నిగ్ధత, సరళత, శీలము విడిచి పెట్టినందువల్లనే నా జీవితానికింతటి విపత్కర పరిస్థితి వచ్చిందని శ్యామ విచారించింది.

---

# కెరటాలు

"మూర్తి జీ"

'నీకేం తెలుసు?- అర్భకుడివి!

పూటకి పదిసార్లు ఇలా ఎదుటి వ్యక్తుల్ని తేలికగా తీసివేయటం అలవాటు కొందరు పెద్దలకు. నిజమే. నాకేం తెలుసు?- నిన్నగాక మొన్న కళ్ళు తెరచిన వాణ్ణి. ఈ అనంత సాగర ఘోషలో నా నిస్వనం ఎన్నవ జలకణమో?- నా చిన్నతనం నేను గుర్తించక పోలేదు. కాని తల నెరిసినంత మాత్రాన సర్వజ్ఞుణ్ణి అనుకునే మనస్తత్వమే నాకు ఆశ్చర్యం కలిగిస్తున్నది. అనుభవాలకు వయస్సు ముఖ్యమా? అయితే వందేళ్ళపాటు చెనిగట్టున విశ్రాంతి తీసుకొన్న పెద్దయ్యకూడా సర్వజ్ఞుడే.

◆ ◆ ◆

మూర్తి చాలా frank గా మాట్లాడతాడు. దీన్ని అందరూ హర్షిస్తారు. అతని నైర్మల్యాన్ని నేనూ మెచ్చుకుంటాను. పరిపూర్ణ వ్యక్తిత్వానికి అంతకన్నా కావలసిన దేముంది? కాని, మనస్సును విప్పి చెప్పివేయటం ప్రమాదభరితమనేది నా అనుభవం. అసలు మన అంతర్యం చూచాయగా ఎదుటివాళ్లకు తెలియజేయటమే అవివేకమనే కఠిన సత్యం- జీవితం నాకు నేర్పిన గుణపాఠాల్లో ఒకటి. ఇది మూర్తి వినిపించుకోడు. అప్పుడు ఏ సత్యమైనా అనుభవంలోకి రావాలి. గుర్తింపబడాలి!

◆ ◆ ◆

నాకు తెలిసినంతలో రాధ నిండుగా నవ్వినరోజు అదొక్కటే. అందుకు కారణం తెలుసుకుని నేనూ నవ్వేను. భర్త అనురాగాన్ని కోల్పోయిన భార్య రాధ. ఆరోజు ఆమె జడలో తురుముకున్న ముళ్లగోరింట పూలను చూసి 'బాగున్నాయని మెచ్చుకున్నాడట- భర్త!' రాధ హృదయంలో కోటి కోరికలు మొలకెత్తినై. కాని, కోరికలు కలగటం ఒక ఎత్తు. అవి తీరటం మరొక ఎత్తు. అతి ప్రియాసమీద వంచి పండును అందుకోబోతున్న సమయంలో (కొమ్మని) జారిపోవటానికే అవకాశాలు ఎక్కువ!

◆ ◆ ◆

జీవితంలోని అనేక అనుభవాలను ఊతగాగొని, కాల్పనిక జగత్తులో రచయితల ఆలోచనలు- ఎంతో మంచివి- కొన్ని మలుపుల్లో ఏకకోణంలోకి తిరిగి పయనించటంలో అసహజత్వమేమీ లేదు. అంత మాత్రాన వాటిని వీరనుసరించారని గాని, అనుకరించారనిగాని చెప్పటం సాహసం కాదా?- కేవలం వ్యూహాగానం కాదా?